తప్పిన 'మిచాంగ్' ముప్పు

రైతాంగానికి 'మిచాంగ్' ముప్పు తప్పింది. అధికారులు, అన్నదాతలు అప్రమత్తమై పంటనష్టం జరగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. కొన్నిచోట్ల వరికోతలు వాయిదా వేసుకోగా, మరికొన్నిచోట్ల కోసిన పంటను కుప్పలుగా వేసుకుని అవి తడవకుండా టార్పాలిన్లు కప్పారు. వరినూర్పులు జరిగిన ప్రాంతాల్లో ధాన్యంబస్తాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, భద్రపరిచారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడి, తీవ్ర తుపానుగా మారినా మంగళవారం సాయంత్రం తీరం దాటే సమయంలో మాత్రం దాని ప్రభావం అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులంతా ఊపిరిపీల్చుకున్నారు. ప్రభుత్వ చర్యలు కూడా సహకరించాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్‌.


బొబ్బిలి: గొల్లపల్లిలో రైతుల ధాన్యం మిల్లులకు తరలిస్తున్న అధికారులు


రేగిడి: రైతులతో వరికుప్పలు వేయిస్తున్న ఏవో మురళీకృష్ణ


బాడంగి: రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్‌బీకే సిబ్బందికి సూచనలిస్తున్న ఏవో శిరీష


బాడంగి: పొలాల్లో కుప్పలుగా వేసుకున్న వరిపంట


బాడంగి: వర్షానికి తడవకుండా వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం


రామభద్రపురం: తారాపురంలో రైతులకు సూచనలిస్తున్న తహసీల్దార్ సులోచనరాణి, ఏవో వెంకటయ్య


రాజాం: అంతకాపల్లిలో రైతులు భద్రపరిచిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఏవో రేణుకాసాయి


సంతకవిటి: శంకరపేటలో పొలంలోనే ధాన్యంబస్తాలు తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచిన దృశ్యం


బొబ్బిలి: విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది

క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని ఏడు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు మంగళవారం వెల్లడించారు. బుచ్చింపేట-1, పొనుగుటివలస-2, సత్యనారాయణపురం-1, మిత్తిరెడ్డి-1, లచ్చయ్యపేట-1, కొండంపేట సచివాలయం పరిధిలో 1 చొప్పున ఖాళీలున్నాయని, ఈ నెల 7 నుంచి 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని పలు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 14వ తేదీన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

రామభద్రపురం: గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు సిబ్బంది, వీవోలతో మంగళవారం సమావేశమైన ఆయన రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజల్లో జీవన ప్రమాణాలు పెంపొందిస్తోందన్నారు. పొదుపు సంఘాల కమిటీ సభ్యులు, అధికారుల సమన్వయంతో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: నియోజకవర్గ కేంద్రమైన బొబ్బిలిలో ఈ నెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాబ్‌మేళాపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్వాన్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు జరిగే జాబ్‌మేళాకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ నీలిమ, ఎంపీడీవో కార్యాలయ ఏవో డీవీ అప్పారావు తదితరులు ఉన్నారు.

సక్రమంగా కుల గణన


వార్డు సచివాలయాల అడ్మిన్‌లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం: సక్రమంగా కుల గణన చేయాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయాల అడ్మిన్‌లతో సమావేశమైన ఆయన కుల గణన నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి, సమగ్రంగా వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా

బాడంగి: పక్కాగా ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ అజురఫీజాన్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటరు జాబితా ముసాయిదా ఆధారంగా ఇంటింటికీ వెళ్లి, ఓటరు వివరాలు సరిచూస్తున్నామన్నారు. ఓటరు జాబితాలో మృతుల ఓటుతో పాటు వలస వెళ్లిన వారి ఓట్లు కూడా తొలగిస్తున్నామన్నారు.

రాజాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో తహసీల్దార్ ఎస్.కె.రాజు మంగళవారం సమావేశమై, ఓటరు జాబితా రూపొందించడం, ఓటరు జాబితా ముసాయిదాపై సమీక్షించారు. కొత్త ఓటర్ల నమోదును వేగవంతం చేయాలని తెలిపారు. రెండు చోట్ల ఓట్లు ఉన్న వారికి వారు కోరిన చోట ఒక్కచోట మాత్రమే ఓటు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఎన్నికల డీటీ ప్రకాష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల వయసు పైబడిన యువతీయువకులంతా ఈ నెల 15వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని, ఇవి గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరుగుతాయన్నారు. పోటీలకు సంబంధించి, క్రీడాసామగ్రి కూడా ప్రభుత్వమే పంపిణీ చేస్తోందన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఎంపీడీవో రమామణి మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతం చేసేందుకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు గ్రామస్థాయి, ఈ నెల 21 నుంచి జనవరి 4వ తేదీ వరకు మండల స్థాయి, 5 నుంచి 10వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయి, 11 నుంచి 21వ తేదీ వరకు జిల్లా స్థాయి, 22 నుంచి 26వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడాపోటీలు నిర్వహించనున్నారన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి 15 ఏళ్ల వయసు పైబడిన యువతీయువకులతో పేర్లు నమోదు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవోలు రవి కుమార్, శ్రావణకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురం: సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రమామణి

బాడంగి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన మండలంలోని 18 సచివాలయాలు ఉండగా, సచివాలయానికి 200 మంది చొప్పున క్రీడాకారులు క్రీడాపోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం


సెప్టిక్ క్లీనర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

• ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ప్రజారోగ్యమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పట్టణంలో మరుగుదొడ్ల క్లీనింగ్‌కు మంజూరైన మూడు సెప్టిక్ క్లీనర్(సెప్టిక్ ట్యాంకరు) వాహనాలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన ఈ వాహనాల ద్వారా మరుగుదొడ్ల మురుగును సేకరించి, డంపింగ్ యార్డుకు తరలిస్తారన్నారు. రాజాం పట్టణ పరిశుభ్రతే లక్ష్యంగా ఈ ట్యాంకర్లు మంజూరు చేయడం జరిగిందని, ఒక్కో ట్యాంకరును ఐదుగురు యువకులతో కలిసిన సంఘాలకు అందించామన్నారు. ఒక్కో ట్యాంకరు ఖరీదు రూ.31,67,326 కాగా, మూడింటికి మొత్తం రూ.95,01,978 కేటాయించడం జరిగిందన్నారు. వీటిని నిర్వాహకులు సక్రమంగా వినియోగించాలని సూచించారు. పట్టణవాసులు కోరిన వెంటనే వారికి సహకరించాలన్నారు. మరోవైపు పట్టణంలో మురుగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు ప్రభుత్వం చేపట్టిందన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో మురుగునీటి నిల్వ ఎక్కువ ఉన్నచోట ఇంకుడుగుంతలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, ఇటువంటి కార్యక్రమాలు చేస్తుండడం చాలా బాగుందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేకానేక నూతన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ కన్వీనర్ కంబాల సందీప్, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ధాన్యం కొనుగోలు చేపట్టాలి


రాజాం: మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

• ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రైతులు ఇబ్బందులు పడకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఎమ్మెల్యే కంబాల జోగులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజాం ప్రాంతానికి చెందిన పలువురు ధాన్యం కొనుగోలు మిల్లర్ల యజమానులతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బందితో మంగళవారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సకాలంలో ట్రక్‌షీట్లు అందేలా, ధాన్యం మిల్లులకు చేరేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలో రైతులను ఉంచవద్దన్నారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మిల్లర్లు రైతులను మోసగించాలని చూస్తే ఆయా మిల్లులకు కొనుగోలు కేంద్రాలను రద్దు చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో బాసూరి శంకరరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు, వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు, వైఎస్సార్ సీపీ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు..

రామభద్రపురం: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలిగితే రైస్‌మిల్లుల అనుమతులు రద్దు చేస్తామని తహసీల్దార్ సులోచనరాణి హెచ్చరించారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మండలంలోని ఏవో వెంకటయ్యతో కలిసి తారాపురం, కొట్టక్కి తదితర గ్రామాల్లోని రైతుల పంట పొలాలు, రైస్‌మిల్లులను ఆమె సందర్శించారు. కొట్టక్కిలో ఓ రైస్‌మిల్లు యజమానితో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కురుస్తున్న వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నూర్పిడి చేసిన ధాన్యం తడవకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రైతులకు అవసరమయ్యే గోనె సంచులు ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. తుఫాన్ నేపథ్యంలో అవసరమైతే సహాయక చర్యలకు వీఆర్‌వోలు అన్ని వేళలా అందుబాటులో ఉండాలన్నారు.


రామభద్రపురం: కొట్టక్కి మోడరన్ రైస్‌మిల్లు యజమానితో మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనరాణి

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు


రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, సంకిలి, బూరాడ తదితర కూడళ్ల వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు, సిబ్బంది కలిసి అటువైపుగా వస్తున్న వాహనాలు నిలిపి, లైసెన్స్, ఆర్‌సీ, పొల్యూషన్ ధ్రువపత్రాలు పరిశీలించడంతో పాటు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

కోళ్లకు వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్లు

తెర్లాం: కోళ్లకు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా వ్యాక్సిన్లు వేస్తున్నారు. మంగళవారం మండలంలోని తమ్మయ్యవలసలో పలు కోళ్లకు పశు సంవర్ధక శాఖ సహాయకులు వ్యాక్సిన్లు వేశారు. కోళ్ల పెంపకందారులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లింగవివక్ష చూపొద్దు


రేగిడి పోలీస్‌స్టేషన్ గోడలపై వాల్‌పోస్టర్లు అతికించిన ఏపీఎం గోవిందరావు

రేగిడి: లింగవివక్ష చూపించొద్దని వైకేపీ ఏపీఎం గోవిందరావు అన్నారు. లింగ వివక్ష వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద లింగవివక్ష చూపొద్దని కోరుతూ రూపొందించిన వాల్‌పోస్టర్లు మంగళవారం అతికించారు. సమాజంలో ఆడ,మగ సమానమేనని, ఇరు వర్గాల వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు ఇవ్వాలన్నారు. మగవారితో సమానంగా స్త్రీలను కూడా గౌరవించాలన్నారు. సమాన హక్కులను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

వినతిపత్రం అందజేత

రాజాం సిటీ: పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వార్డు సచివాలయాల వద్ద సమాచార హక్కుచట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఆర్గనైజేషన్ సభ్యుడు డోల వాసుదేవరావు కోరుతున్నారు. ఇదే విషయమై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సమాచార హక్కు చట్టం-2005పై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందని, కార్యాలయాల వద్ద అప్పీల్ అధికారి వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాసుదేవరావు

గ్రామాల్లో వైద్య శిబిరాలు

రేగిడి: మండలంలోని అప్పాపురం, మజ్జిరాముడుపేట, రేగిడి, ఆమదాలవలస తదితర గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. రేగిడిలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు శిబిరాలకు వచ్చే రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.


రేగిడిలో నిర్వహించిన వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు

10న ఘంటసాల పాటల పోటీలు

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 10వ తేదీన ఘంటసాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మింది విజయమోహన్ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు 20 మంది గాయనీగాయకులతో పాటల కచేరీ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు పోటీలో పాల్గొనేందుకు ఈ నెల 7వ తేదీలోగా తమ పేర్లను ఫోన్ నంబర్ 9440744741 ద్వారా సంప్రదించాలన్నారు.

ఆధ్యాత్మిక సందడి

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో పలుచోట్ల జరిగిన పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్తీకమాసం పురస్కరించుకుని, అయ్యప్ప, భవాని, శివ మాలాధారణ చేసిన వారితో పాటు భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. మంగళవారం సైతం పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి, దైవదర్శనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్‌.


రాజాం: మొగిలివలసలో పూజలందుకున్న కాలభైరవుడు


రేగిడి: ఆమదాలవలసలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రాజాం: పెనుబాకలో శివభక్తుల అంబలం పూజ